

"ఆడపిల్ల పెళ్ళయినా చెయ్యొచ్చుగాని నిరుద్యోగికి పెళ్ళవడం మాత్రం మహా కష్టం" ఎవరో అన్న మాటలు గుర్తుకొచ్చాయి రామనాధానికి.

"చూడండి. ఏం చదువుకున్నావు? ఏ హోదాకి? అనే రోజులు పోయాయి. ఇప్పుడెవరయినా ఉద్యోగమొచ్చిందా? జీతమెంత?

అనే అడుగుతారు. చదువుకున్న వాళ్ళలో చాలామందికి ఉద్యోగాలు రావన్న రహస్యం అందరికీ తెలిసిపోయింది. మీ అబ్బాయి ఇంజనీరింగ్ ఏ క్లాసులో పాసయితే మాత్రం ఏం లాభం? ఉద్యోగం లేందే! పైగా 'ఇంజనీరింగ్ చదివిన కుర్రాడికి మాత్రం పిల్లనివ్వద్దు. వాళ్ళకి ఉద్యోగాలు రావట' అని తెలిసినవాళ్ళంతా చెవినిల్లుకట్టుకొని చెపుతున్నారు. నిర్మొహమాటంగా మాట్లాడుతున్నానని బాధపడకండి. ఉద్యోగమొచ్చిన వెంటనే రాయండి. అంతవరకు మా అమ్మాయికి మరే సంబంధం రాకపోతే తప్పకుండా మీ అబ్బాయికే ఇస్తాను."

బస్సెక్కుతూ కాబోయిన వియ్యంకుడు యోగీశ్వర్రావన్న మాటలు చెవుల్లో ఇంకా గింగురు మంటున్నాయి. దుమ్ము రేపుకుంటూ పోతున్న బస్సులోంచి చెయ్యూపుతున్న యోగీశ్వర్రావుకి యాంత్రికంగా వీడ్కోలు చెప్పాడు. ఓ క్షణం పాటు నిశ్చేష్టుడై నిల్చున్న రామనాథం దుమ్ము పడిన బట్టలనోసారి దులుపుకొని కిళ్ళీబడ్డీ పక్కకి తప్పుకున్నాడు, అలవాటు ప్రకారం మట్టిరోడ్డని తిట్టుకుంటూ — అదేం చిత్రమో! రోడ్డుని తిట్టుకుంటాం రోడ్డుని బాగుచేయించలేని మనుష్యుల్ని కాదు—బహుశా వాళ్ళైతే బాధపడతారని!

పాతికేళ్ళుగా బడిపంతులుగా పనిచేసిన రామనాథం తన సర్వీసులో ఓ వాచీ కొనుక్కోలేక పోయాడు.(అతనితప్పుకాదు — ఉద్యోగంతప్పు!) టైముకోసమని కిళ్ళీబడ్డీ వంక చూశాడు — స్వాతంత్ర్యంవచ్చి పాతికేళ్ళయిందని గుర్తుచేస్తూ కిళ్ళీ బడ్డీ మీద జాతీయపతాకం గర్వంగా రెపరెపలాడుతోంది.

నిమిదేళ్ళ క్రితం నరసింహారావుకి బి. ఇ. లో సీటొచ్చినపుడు ఎంతగానో మురిసిపోయాడుతను. "అంత పెద్దచదువు చదివించగలమా ' అన్న పార్వతితో "తల తాకట్టు పెట్టైనా చదివిస్తాను. ఇంజనీరు సీటంటే మాటలా? వీడు తెలివైనవాడు గనుక వచ్చిందిగాని మిగతావాళ్ళు పైలు పెట్టి కొనుక్కోవాలి" అంటూ [illegible] చేసే కొడుకు తెలివిని వివరించాడు. "మాస్టారూ!—మీ నరసింహానికి ఇంజనీరింగ్ సీటొచ్చిందట, గదూ?" అని ప్రెసిడెంటు పుల్లారెడ్డిగారు అడిగినప్పుడు "అవునండీ, మీ దయవల్ల పెద్ద ఇంజనీరుకి సీటొచ్చింది" అని సగర్వంగా గర్వాన్ని ప్రదర్శించేవాడు, "పెద్ద" అనే పదంమీద స్ట్రెస్‌యిస్తూ. దానికి కారణం లేకపోలేదు. అప్పటికి మాఊళ్లో పాలిటెక్నిక్ చదివి హైదరాబాదులో "సూపర్వైజర్' ఉద్యోగం చేస్తున్న పంచాయితీ గుమాస్తా శంకరయ్య కొడుకొకడే గొప్ప చదువు చదివిన అతని గురించి ఊరంతా ఇంజనీరుగారని ఘనంగా చెప్పుకుంటుంటారు. అంతకంటే పెద్ద చదువన్న విషయం దానికే స్ఫురించాలనే రామనాథం ఉద్దేశ్యం.

ఇంజనీరు చంద్రని తను గురించి


ఊరు వాడా పెద్దగా చెప్పుకుంటారు. వీడికి ఎంత తక్కువయినా అయిదొందలు జీతం వుంటుంది. ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్ళి చేస్తే ''బంగారంవంటి పిల్ల'' బోల్డు కట్నంతో వచ్చి పడుతుంది. ఇద్దరు చెల్లాయిల పెళ్ళిళ్లూ, చిన్నవాళ్లిద్దరి చదువులూ నరసింహమే చూసుకుంటాడు. తను హాయిగా కాలుమీద కాలువేసుకొని ఇంజనీరు తండ్రి అయిపోయినట్టే కలలు కన్నాడు రామనాథం.

ఇప్పుడు తన కొడుకు ఇంజనీరింగ్ చదివాడని చెప్పుకోవటమే అవమానంగా భావిస్తున్నాడు. చదువు పూర్తయి మూడేళ్ళుగా ఉచితంగా రోడ్లు సర్వే చేస్తూ పోస్టల్ డిపార్ట్‌మెంట్ వాళ్ళకి వాయిదాల పద్ధతిమీద ముడుపు చెల్లించుకుంటున్న కొడుకుని చూస్తుంటే కొండంత కోపం... అతగాడికి టి. ఎ: డి. ఏలు ఇచ్చుకోలేక తను తల్లడిల్లి పోతున్నాడు. 'అబ్బాయి ఊళ్ళోనే ఉంటున్నాడు ఉద్యోగం రాలేదా?' అని రోజూ ఎవరో ఒకళ్లు ప్రశ్నించడమే! రాకేం! డిస్టింక్షన్‌లో పాసయ్యాడు కదా, పెద్ద ఉద్యోగమయితే కాని—వెళ్ళడం ఇష్టంలేక'' అంటున్నాడు తను లేని చిరునవ్వుని పెదవుల మీదకు తెచ్చుకుంటూ.

నరసింహారావు పట్నంలోనుండి పెద్ద చదువుచదివినట్టు మాత్రం ఆ చుట్టుపక్కల బాగా ప్రచారమైపోయింది. పైగా కుర్రాడి బుద్ధిని గురించి రామనాథంగారి కుటుంబ ప్రతిష్ఠను గురించి అప్పటికే మంచి వాడుక ఏర్పడింది. చదువు పూర్తయిన దగ్గర్నుంచి పెళ్లిసంబంధాలు జోరుగానే వస్తున్నాయి. మొదట్లో ఉద్యోగమొస్తేగాని పెళ్లి చెయ్యనని మొరాయించేవాడు రామనాథం. ఆ తర్వాత ఉద్యోగం అంత తేలిగ్గా రావన్న చేదునిజం తెలిసి పెళ్ళయితే యింటల్లుళ్ళ ఖర్చులు బాధైనా తనకు తప్పుతుందని మంచి సంబంధం వస్తే చేస్తాననే నిర్ణయాన్ని ప్రకటించేశాడు. కొడుకు పాతికేళ్ళవాడయ్యాడు గనుక ఓ యింటివాడు కావడం ఇక ఆలస్యం కాకూడదనే పార్వతమ్మ తొందరకూడా రామనాథం ఈ నిర్ణయం తీసుకోవడానికి తోడుపడింది.

వచ్చినవాళ్ళంతా ఒకటే అడుగుతున్నారు — "అబ్బాయికి వుద్యోగం వచ్చిందా?" అని. ''రాకేంచేస్తుంది— బి ఇ డిస్టింక్షన్‌తో పాసయ్యాడు' అనేవాడు రామనాథం తెచ్చిపెట్టుకున్న గర్వాన్ని ప్రదర్శిస్తూ, ''తర్వాత కబురు చేస్తాంలెండి'' అని వెళ్లిపోయేవారు వెళ్లినవాళ్ళు మళ్ళీ కనపడేవారుకారు.

ఇప్పుడు యోగీశ్వర్రావుగారి సంబంధం....బంగారంలాంటి సంబంధం .... కుర్రాణ్ణి చూట్టిగాని తమలంతస్తుకి రావలసిన సంబంధంకాదు ఊరూనోటా ఇదేమాట అందమైన తీగలాంటిపిల్ల — అంతకు మించిన యాభై వేల రూపాయల కట్నం, అంత కట్నం ఇచ్చేటప్పుడు ఉద్యోగం




లేకపోతేమాత్రం యేం? .... తర్వాత ఎలాగూ వస్తుందికదా! అదే అడిగాడు తను. అల్లుడు పెద్ద వుద్యోగస్తుడని గొప్పగా చెప్పుకోడానికేగదా ఇంతకష్టం పొయ్యడం—డబ్బుని చూసి కాదు పిల్లని ఇవ్వడం.... అబ్బాయికొచ్చే వుద్యోగాన్ని (జీతాన్ని) చూసి— ఆ ముద్రలేనిదే పిల్లనివ్వటం కుదరదని నిష్కర్షగా చెప్పేశాడు యోగేశ్వర్రావు. అవును, ఎవరో అన్నట్టు డబ్బు డబ్బుని ప్రేమిస్తుంది.

ఈ సంబంధాన్ని పోనివ్వకూడదు.... మరొకళ్ళు తన్నుకుపోకముందే జాగ్రత్త పడాలి .... ఎలాగైనాసరే నరసింహానికి వుద్యోగం సంపాదించాలి .... ఇంజనీరు కాకపోతే మరోటి....డబ్బు ఖర్చుపెడితే బ్యాంకు వుద్యోగాలొస్తాయి. మరో అయిదువేలు అప్పుచేసయినా సరే వుద్యోగం సంపాదించాలి ..ఆతర్వాత వాడి జీతం మీద నెమ్మదిగా తీర్చుకోవచ్చు,

వుద్యోగం కావాలి వుద్యోగం కావాలి వుద్యోగానికి డబ్బుకావాలి....

వూళ్లోకి వెళ్ళడానికి ముందు కడుగేలాడు రామనాథం. ఇంతలో ఓ బస్సువచ్చి ఆగడం—ఆయన బస్సులోంచి పెవం దిగడం — క్షణం తీరికలేనట్టు బస్సు దూసుకుపోవడం.. దుమ్ము అణిగిన తర్వాత గాని తెలియలేదు! వెనక వస్తున్న బస్సు ముందుకుపోతుందని పోటీబడి బస్సులు నడపటంవల్లే రోడ్డు ఇంత అన్యాయంగా తయారైంది!

"నమస్కారం మాస్టారూ కులాసాగా ఉన్నారా?" బస్సులోంచి దిగిన వ్యక్తి పంచాయతీ గుమస్తా శంకరయ్య కొడుకు శ్రీనివాసరావు. అయిదో క్లాసు వరకు తన దగ్గరే చదువుకున్నాడు.

"ఏవిట్రోయ్ - హైదరాబాదు నుంచి ఇదేనా రావడం?"

"అవును మాస్టారూ! మా చెల్లాయికి సంబంధం వచ్చిందట!"

"అవునవును. మీ నాన్న చెప్పాడు."

"మాట్లాడ్డం కోసం రమ్మన్నాడు. పది రోజులు సెలవుమీద వచ్చాను. పైగా ఇంత అర్జంటుగా రావడం మీ అబ్బాయి ఉద్యోగం గురించి మీతో మాట్లాడుదామని అతనింకా ఖాళీగానే ఉన్నాడు కదూ?"

"అవునా బాబూ."

"రండి మాట్లాడుకుంటూ వెళ్దాం" రిక్షాను పిలిచి సామాను వేయించాడు. రిక్షాలో సామాను చేరవెయ్యడంలో రామనాథంకూడా ఓ చెయ్యి వేశాడు. ఇద్దరూ రిక్షా ఎక్కి కూర్చున్నారు. ముందుకు పోతున్న రిక్షా మువ్వలు మోగుతున్నాయి.

"నా శిష్యుడు ఇంత గొప్పవాడు అయినందుకు నాకు చాలా సంతోషంగా వుంది బాబూ!" రామనాథం ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. రిక్షామీద కూర్చోవడం అలవాటు లేని తను సింహాసన మెక్కినట్టు తబ్బిబ్బౌతూ శ్రీనివాసరావుకి ఎక్కడ ఇబ్బంది కలుగుతుందోనని ఒదిగి కూర్చున్నాడు.


"మా కంపెనీలో 'డిజైన్ ఇంజనీర్' పోస్టొకటి వచ్చింది. రెండ్రోజుల్లో పేపర్లో పడుతుంది. చూసి అప్లై చెయ్యమనండి. పెర్సనల్ మేనేజర్ నాకు బాగా తెలుసు. నేను చెపితే వింటాడు కూడా, అంచేత మీ వాడికి ఉద్యోగం ఇప్పించగలననే నమ్మకం నాకుంది.'

"మీరా నమ్మకముంటే తప్పనిసరిగా పని జరుగుతుంది. మీ కంపెనీలో మీకున్న పలుకుబడి గురించి విన్నాను. పెద్దవాళ్ళకేం కావాలి? స్నేహం మీద ఎటువంటి పనులైనా చేసి పెడతారు." డబ్బు ప్రసక్తి వస్తుందేమోనని లౌక్యంగా కదలేశాడు రామనాథం.

"అంతేలెండి. కేవలం పరిచయంమీదే పని చేయించుకోవాలి. ఆయన డబ్బుకీ దస్కానికీ ఆశపడే రకం కాదు. ఈ పోస్టుకి ఎన్నికయ్యినట్టయితే జీతం నెలకు ఆరొందల యాభై వరకు వస్తుంది.'

ఆరొందల యాభై జీతమనేసరికి ఆకలిగా వున్న వ్యక్తి ఆకలి కళ్ళకు అన్నం ముద్ద కనిపించినట్టు రామనాథం మెదడులో 'ఎలక్ట్రిక్ స్పార్క్'లా మెరిసిన ఆశ అతని కళ్ళల్లో దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

'ఆయన 'ఎలాంటి వ్యక్తి' కాకపోయినా మధ్య వాళ్ళెవరయినా కక్కుర్తి పడొచ్చు. అవసరమయితే వెయ్యో రెండు వేలో అప్పు చేసయినా తగలేద్దాం. ఉద్యోగమొస్తే ఆ తర్వాత వాడే తీర్చుకుంటాడు'




"ఆ అవసరమేమీ రాదనుకుంటాను. స్వయంగా ఆయనతో నేనే మాట్లాడతాను."

"అంతకంటే కావల్సిందేముంది! వాడు నీ సోదరుడనుకొని ఈ ఉద్యోగం నువ్వే ఇప్పించాలి. ఆ బాధ్యత నీదే మరి." శ్రీనివాసరావు చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"నైన్టీ పర్సంట్ వస్తుందనే అనుకుంటాను ఆపైన అతని అదృష్టం."

"అదృష్టముండబట్టే సమయానికి నువ్వు దేవుడిలా వచ్చావ్. వాడి యోగమెలావుంటే అలా జరుగుతుంది, రాతనెవరూ తప్పించలేరనుకో...."

"ఆపవోయ్!"

మాష్టారు తుళ్ళిపడ్డారు. శంకరయ్య గారింటిముందు రిక్షా ఆగింది.

* * *

శ్రీనివాసరావు పలుకుబడిమీద రామనాథానికి ఘట్టి నమ్మకముంది. ఆ ధైర్యం చూసుకొనే 'మీ అబ్బాయి రికామీగా తిరుగుతున్నాడు, ఉద్యోగం రాదా?' అని దెప్పిపొడిచే వాళ్ళకి ఇప్పుడు హైదరాబాదులో శంకరయ్యగారబ్బాయి పన్చేస్తున్న కంపెనీలో 'డిజైన్ ఇంజనీర్ వుద్యోగం వచ్చింది. జీతం ఆరొందల యాభై' అని తలెత్తుకు చెప్పేసుకుంటున్నాడు.

ఆ వూరికి ఉత్తరం వైపున్న ముక్కాలవమీద వంతెన శాంక్షన్ చేయించుకోడానికి ఊరుమ్మడి ఖర్చులమీద గ్రామపెద్దలంతా హైదరాబాదు తరలి వెళ్ళినప్పుడు అక్కడ శ్రీనివాసరావు పలుకుబడిని చూసి ఆశ్చర్యపోయారు. అతని సహాయమే లేకపోతే వంతెన శాంక్షనయి వుండేది కాదు. ఊళ్ళో పెద్ద కాపులమని

ప్రయాణం కట్టిన వాళ్ళు వరుసగా నిర్వేది కాదు. అందుకే ఊళ్ళో వాళ్ళతోబాటు శ్రీనివాసరావు పలుకుబడి మీద రామ నాథానికి కూడా అంత గురి.

నరసింహారావుకి ఉద్యోగం వస్తుం దన్న సంగతి చిలవలు - పలవలతో ఊరంతా పాకిపోయింది. ఈ వార్త తెలి సిన యోగీశ్వర్రావుగారు మళ్ళీ రామ నాథం గారింటికి నిజానిజాలు తెలుసు కోవడం కోసం రావడంతో ఆ సంబంధం ఖాయమైనట్టు కూడా చెప్పేసుకుంటున్నారు.

ఓ రోజు శంకరయ్య, శ్రీనివాసరావు కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకొంటుం డగా పంచాయితీ నౌకరు అప్పన్న తన సందేహం కాస్తా తీరుకున్నాడు.

"బాబూ! నాకు తెలీకడుగుతాను మన మేష్టారబ్బాయి నరసిమ్మంగారిది మీకంటే పెద్ద సదువా?"

శ్రీనివాసరావు కలవరపడిపోయాడు. తేరుకుని సమాధానం చెప్పేలోగా శంక రయ్య అందుకున్నాడు

"ఏం పెద్దలెమ్మ. ఉద్యోగం లేక మూడేళ్ళనుంచి ఊళ్ళో ఖాళీగా తిరుగు తున్నాడు."

"మన నరసిమ్మారావు పనిసేత్తున్న దాంట్లోనే యేదో పనొచ్చిందని సెప్పు కుంటున్నారులెండి. జీతం కూడా ఆరొం దలు పైనుంటుందంట."

శంకరయ్య ప్రశ్నార్థంగా శ్రీని వాసరావుకేసి చూశాడు

"అబ్బే! ఇంకా రాలేదు. ఓ పదిహేను రోజుల్లో రావొచ్చు నా ద్వారానే ప్రయ త్నం చేస్తున్నాం," శ్రీనివాసరావు ముడి విడదీశాడు.

"రావాలి. వచ్చిందనుకోవాలి. ఇలా పాపం, ఆ కుర్రాడికి చాలా ఉద్యోగాలు తప్పిపోయాయి. పెద్ద రికమెండేషన్లు లేనిది ఈ రోజుల్లో ఉద్యోగం రావడం మాటలా? అక్కడికీ నేను ఆ మాష్టా రుతో చాలసార్లు చెప్పాను. వెళ్ళి మా వాణ్ణి ఓసారి కలవమని ఆయనలా అడగటం చిన్నతనమనుకుంటాడు. మన వాడుండబట్టే కదా నా బంధువని ఈ వుద్యోగమిప్పిస్తున్నాడు." కొడుకు పేరు చెప్పి ఆ ఊళ్ళో పెద్దమనిషి తరహాను ప్రదర్శిస్తున్న తర్వాత శంకరయ్య ఈ రకమయిన ఉపన్యాసాల కలవాటు పడి పోయాడు. తండ్రి స్వభావం శ్రీనివాస రావు కంతగా నచ్చదు.

"సిత్రం .... మరి ఉజ్జోగం చూసే యోగీశ్వర్రావుగారు యాభయ్యేలు కట్నంతో పిల్లనిత్తారని కూడా సెప్పుకుంటున్నా రండి"

"ఉద్యోగం వచ్చే అవకాశముందిలే. ఆ ధైర్యంమీద ఇస్తున్నారేమో" శ్రీని వాసరావుకి ఎదుటి వాళ్ళను తప్పవేసి మాట్లాడ్డం కిష్టం.

"వస్తా బాబూ! ఇదిగో తోక అంటే అదిగో పులి అంటారు" అన్న లోక జ్ఞానాన్ని ప్రదర్శించి మరీ వెళ్ళిపోయాడు, నౌకరు అప్పన్న.

యాభై వేలనేసరికి శంకరయ్య గుండెల్లో రాయి పడింది. ఎనిమిదేళ్ళ క్రితం శ్రీను పెళ్ళయినపుడు అతని ఉద్యోగం చూసి పాతిక వేలు కట్నమిస్తేనే పెద్ద కట్నమని ఊరంతా చెప్పుకున్నారు. ప్రెసిడెంటు పుల్లారెడ్డిగారితో సహా తన అదృష్టాన్ని మెచ్చుకున్నారు. ఇప్పుడు యాభై వేల కట్నం వస్తుంటే మాష్టారి గురించి ఊరంతా మరింత గొప్పగా చెప్పుకుంటారు.

మనిషిలో బలహీనత....తను ఎదగక పోయినా ఫర్వాలేదుగాని పక్కవాడు తన కంటె గొప్పవాడు కాకూడదు. మూడో మనిషి బాగుపడినా సహించగలడు.

శంకరయ్య ఎంత లౌక్యుడో శ్రీనివాసరావు అంత యోగ్యుడని ఊరంతా చెప్పుకుంటారు. శ్రీనివాసరావు హైదరాబాదులో స్థిరపడి పదేళ్ళయింది, అప్పటికీ ఇప్పటికీ అతని ప్రసక్తి వచ్చినప్పుడల్లా ఊళ్ళో చెప్పుకోదగ్గ మేధావిగా అతను జనవాక్యంలో నిలిచిపోయాడు.

నరసింహానికి ఈ వుద్యోగం రావడం శంకరయ్యకి సుతరామూ ఇష్టంలేదు. కాని శ్రీనివాసరావు తనమాట లెక్కచేసే రకం కాదని ఊరుకున్నాడు.

ఈ వుద్యోగం సంగతి శంకరయ్యకి ముందుగా తెలియకం రామనాధాని కిష్టం లేదు. శ్రీనివాసరావు చదువుకునే రోజుల్లో రామనాధం దగ్గరకు పరిగెట్టుకువెళ్ళి సలహాచేసే శంకరయ్య అతనికి వుద్యోగమొచ్చిన తర్వాత రామనాధం కనిపించినా పలకరించడం మానేశాడు. పైగా ఒకటి రెండుసార్లు రామనాధాన్ని కలిసిన సందర్భాల్లో—"ఎందుకు వాణ్ణి డబ్బుతగలేసి ఇంజనీరింగ్ చదివిస్తున్నావ్ — వున్న వాళ్ళకే వుద్యోగాలు లేకపోతే" అంటూ వుచిత సలహాలిచ్చేవాడు.

అందుకే తరచు ఇంటికి వెళ్ళడం ఇష్టం లేక శ్రీనివాసరావు హైదరాబాదు వెళ్ళిపోయే ముందు బస్టాండ్‌లో కలిశాడు రామనాధం....

"ఈ వుద్యోగంమీద చాలా ఆశ పెట్టుకున్నాను బాబూ! నీదే పూచీ మరి."




ప్రాధేయపడుతున్నాడు అయిదు పదులు పై బడిన రామనాథం....

"మీరిన్నిసార్లు చెప్పాలా మాష్టారూ. తప్పనిసరిగా ప్రయత్నిస్తాము. ఇంటర్వ్యూ కార్డు రాగానే సరాసరి నా రూమ్‌కి రమ్మని చెప్పండి మీ వాడికి ఎడ్రసు ముందే ఇచ్చాను"

"థాంక్స్ బాబూ!" రామనాథం కళ్ళల్లో కృతజ్ఞత తొణికిసలాడుతోంది.

రిక్షాలాగే ఈరాజు సామానుకింద పెడుతూ అడిగాడు.

"బాబూ మేష్టరుగారబ్బాయికి కూడా తమరు పనిసేత్తున్న కంపెనీలోనే పెద్ద ఇంజనీరొ త్తాడటగా.... జీతం ఎవరికెక్కు వుంటుంది బాబూ?"

శ్రీనివాసరావు హృదయం కలుక్కుమంది. జవాబు చెప్పడానికి ఇబ్బంది పడిపోతున్నాడు. రామనాథం అతని అవస్థ గమనించి సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మా వాడికింకా...."

బస్సువచ్చేసింది. హడావిడిగా సామాను బస్సులోకి చేరవేసి సమయానికి ఆదరాబాదరాగా శంకరయ్య కూడా వచ్చాడు..రేగుతున్న దుమ్ములో, బస్సులో కూర్చొన్న శ్రీను చేతి సంజ్ఞ తప్పిస్తే మరేం చెప్పడానికి ఇద్దరికీ అవకాశం చిక్కలేదు.బస్సు పెద్దగా రొదచేసుకుంటూ వెళ్ళిపోయింది.. !

* * *

ఉద్యోగం కావాలి.... చిరంజీవి నరసింహానికి వుద్యోగంకావాలి....

రామనాథం కునికిపాట్లు పడుతున్నా అతని మెదడు మాత్రం తీవ్రంగా ఆలోచిస్తూనేవుంది, ఆర్టీసీ బస్సు కుదుపుకి ఆలోచనలు విరిగిపడుతున్నాయి.

కళ్ళు తెరిచాడు రామనాథం. ఎదురు సీటులోవున్న వ్యక్తి మీద అతని దృష్టి పడింది. ఇంతకు ముందు ఆ సీటులో లేడు. పక్క స్టేజిలో ఎక్కినట్టున్నాడు.

"అనకాపల్లి దాటేశాం కదండీ?" ఎదురుగావున్న సీటువ్యక్తి నుద్దేశించి.

"ఇంకా ఎక్కడ అనకాపల్లి. మరో పది నిమిషాల్లో గాజువాక చేరుకుంటాం."

"టైమెంతయ్యిందంటారు?"

"మూడున్నర" రామనాథంకేసి పరికించనగా చూస్తూన్నాడతను.

"ఏమిటలా చూస్తున్నారు?"

"మీరు రామచంద్రపురం హైస్కూలులో చదివారు కదూ?"

"అవును. మీకెలా తెలుసు?" ఆశ్చర్యం, ఆనందం రామనాధాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.


"మీ పేరు రామనాథం."

"అవును."

అమాంతం కౌగలించేసుకున్నాడు అంత పెద్ద మనిషిను.

రామనాధానికి నోట మాట రావడం లేదు.

"నేను.... నేను సుబ్బారావుని, ఒకే




బెంచీమీద కూర్చొనే వాళ్ళం. ఆ తర్వాత నేను కాలేజీలో చదువుతున్నప్పుడు కాకినాడలో ఒకటి రెండుసార్లు కలుసుకున్నాం."

"పాతికేళ్ళయింది కదూ, ఆఖరిసారిగా కల్సుకొని." రామనాథం గుర్తుకు తెచ్చుకుంటున్నాడు.

బస్సులో వాళ్ళంతా విడ్డూరంగా చూస్తున్నారు. కృష్ణ కుచేలుల్లాంటి ఇద్దరు పెద్ద మనుషులూ ఆలింగనం చేసేసుకున్నారని.

"మీరిప్పుడు ...." ఏదో అడగబోయాడు రామనాథం.

"పర్వాలేదు. నువ్వు అను. హైదరాబాదులో పన్చేస్తున్నాను. అనకాపల్లి బంధువులింటికి రావాల్సొచ్చింది. ఎలాగూ ఇక్కడదవరకూ వచ్చానుగదా అని యూనివర్శిటీలో ఓ ఫ్రెండుంటే చూడ్డానికెళుతున్నా. నువ్వప్పుడే ముసలాడివై పోయావు సుమా" సుబ్బారావుది విందు విగ్రహం. నలభై యేళ్ళవాడిలా కనిపిస్తాడు.

"ఏముంది? సంసార తాపత్రయం బెంగలూనూ," రామనాథం సుబ్బారావు సూటుకేసి ఓసారి చూసి, తన ముతక పంచె లాల్చీకేసి చూసుకొని సిగ్గుపడిపోయాడు.

"ఏం చేస్తున్నావు? పిల్లలెంతమంది? ఎవరైనా ఉద్యోగాలు చేస్తున్నారా? ఆడపిల్లలకు పెళ్ళిళ్ళయాయా? అంతా కులాసాగా వున్నారా?" ప్రశ్నమీద ప్రశ్న కురిపించేస్తున్నాడు సుబ్బారావు.

తాపీగా అన్నీ వివరించాడు రామనాధం.

"అయితే పెద్దాడు మూడేళ్ళగా ఖాళీగా వుంటున్నాడా? అరరే .... నువ్వు పది రోజుల క్రితం కనిపించి వుంటే మీ వాడికో మంచి ఉద్యోగం ఇప్పించే వాణ్ణి."

"జరిగిపోయిందానికేంగాని ఇకముందు చూసి పెడుదూ?"

"తప్పకుండా. మరిప్పుడెక్కడికి బయల్దేరావ్?"

"ఏవుంది? సంబంధం గురించి చెప్పానుకదా. అది తప్పిపోకుండా వుండాలంటే వాడికి వెంటనే ఉద్యోగం రావాలి. వైజాగ్‌లో మా వూరి ప్రెసిడెంటుగారి స్నేహితుడొకాయన ఉన్నాడు. ఆయన దగ్గరకు 'ఉత్తరం' తీసుకెళ్తున్నా-వాళ్ళ కంపెనీలో ఏదైనా ఉద్యోగం ఇప్పించమని."

"మీ వాడి మాటెలా వున్నా ఈ వయస్సులో నువ్వు హైరాన పడిపోతున్నావు."

"ఏం లాభం? ఫలితం దక్కడం లేదు. మొన్న మీ హైదరాబాదులో ఒక వుద్యోగం నోటీవరకూ వచ్చిందే అందకుండా పోయింది. 'ప్రతిభ టూల్స్ లిమిటెడ్' అని ఓ పెద్ద ఫర్మ్ ఉందట. దాంట్లో శ్రీనివాసరావని మా వూరబ్బాయి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి పెర్సనల్ మేనేజర్ బాగా తెలుసట తప్పని సరిగా ఉద్యోగం వస్తుందనుకున్నాం. ఇంటర్వ్యూకి కూడా ఇద్దర్నే పిలిచారట. ఇద్దరిలో మెరిట్ ప్రకారం మా వాడికే రావాలట. పైగా మానేజర్ మా శ్రీనివాసరావుకి మాటిచ్చాడటకూడా. కాని చివరకు అవతలవాడి దగ్గర డబ్బు తినేసి వాడికిచ్చేశాడట ఉద్యోగం."

కుతూహలంగా వింటున్న సుబ్బారావు సగంలో నిశ్చేష్టుడైపోయాడు.

"నరసింహారావు మీ అబ్బాయా?"

"అవును. నీ కెలా తెలుసు?"

"నేనే ప్రతిభా టూల్స్ పెర్సనల్ మేనేజర్ని. మీ వాణ్ణి ఇంటరువ్యూ చేసింది కూడా నేనే."

రామనాధం గుండెల్లో అటంబాంబు పేలినవైనం మొహంలో విస్పష్టంగా కనిపిస్తోంది.

"శ్రీనివాసరావుకు మీకూ ఏవైనా స్పర్ధలున్నాయా?" సుబ్బారావ్ అడిగాడు.

"అబ్బె ఏంలేవు. పైగా మేం కావాల్సినవాళ్ళం కూడా!"

"శ్రీనివాసరావు చాలా ఉత్తముడని నా అభిప్రాయం"

"ఊళ్లోకూడా అతని గురించి అందరికీ అదే అభిప్రాయముంది"

"ఇంటర్వ్యూ ముందు రోజు మీవాణ్ని తీసుకొచ్చి పరిచయంచేసింది శ్రీనివాస

రావే. నిజానికి ఇంటర్వ్యూలోకూడా మీ వాడే బాగా ఆన్సరు చేశాడు. వెంటనే శ్రీనివాసరావుని పిల్చి "మీవాణ్ని సెలక్ట్ చేస్తున్నానోయ్" అన్నాను.

అతను "నరసింహం నాకు కావాల్సిన వాడే. అయినా ఇలాంటి "రెస్పాంసిబుల్ పోస్ట్" విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇంతకు మునుపు అతను బాంకులో మూణ్నెల్లు పన్చేసిన తర్వాత ప్రవర్తన బాగుండక తీసేశారని తెల్సింది. పోనీ వాడీలు చెబుతున్నాననుకుంటే రెండో వ్యక్తి నాకు అసలు పరిచయంకూడా లేదని మీకు తెలుసు. ఆ తర్వాత మీ యిష్టం" అన్నాడు.

శ్రీనివాసరావు నిజాయితీమీద నాకు మంచి నమ్మకం, మీ వాడు అప్లికేషన్‌లో కూడా బాంకులో మూణ్నెల్లు పన్చేసినట్టు తెలియపర్చాడు. దాంతో "డిస్క్వాలిఫై" చెయ్యాల్సొచ్చింది. అంతే కాని నేను లంచం తీసుకోవడం మాత్రం అబద్ధం. కాని శ్రీనివాసరావు నా గురించి ఇలా చెప్పడం ఆశ్చర్యమే మరి!"

"అంతేకాదు. బాంకులో మా వాణ్ని "లీవ్ వేకన్సీ"లో వేశారు. ఆ టెంపరరీ సర్వీసును శ్రీనివాసరావు తన కధనంలో అందంగా వాడుకొన్నాడు."

"శ్రీనివాసరావు ప్రమేయం లేకపోతే మీ వాడికి ఉద్యోగం వచ్చివుండేది—తెలుసా?" సుబ్బారావు మరోసారి స్పష్టం చేశాడు.

శ్రీనివాసరావు హైదరాబాదు వచ్చే ముందు బస్ స్టాండ్‌లో జరిగిన సంఘటన రామనాథం కళ్ళ ముందు మెరిసింది. అర్థమైందన్నట్టు తలూపి, వేదాంతిలా చిరునవ్వు నవ్వాడు.

బస్సు ఒక్క కుదుపుతో స్టాండులో ఆగింది, ఇద్దరూ హడావిడిగా దిగారు ...

"అయితే శ్రీనివాసరావుకి మీమీద ఏద్వేషంలేకుండానే ఎందుకిలా చేశాడంటావ్?" సుబ్బారావుకి పజిలు విడిపోవడం లేదు.

ఎదురుగా గోడమీద, ఆర్టిస్టు ఏదో కొత్త అడ్వర్టయిజుమెంటు రాస్తున్నాడు. రెండు గీతలు గీశాడు. ఒక గీత పెద్దదిగా ఉండాలని రెండో గీతని తుడుపుతున్నాడు...

ఇద్దరి దృష్టి అటు పడింది.

"పక్కగీతను చెరిపేకంటే మొదటి గీతను పొడిగించే ప్రయత్నం చేస్తే బావుణ్ను" అన్నాడు రామనాథం—

అయోమయంగా చూశాడు సుబ్బారావు.

*